క్లుప్తంగా

పింఛన్ల సర్టిఫికెట్ల పరిశీలన కేంద్రం ఏర్పాటు



వైద్యశాలలో దివ్యాంగులను పరీక్షిస్తున్న డాక్టర్ జయగోపాల్

సత్యవేడు: మండల పరిధిలో దివ్యాంగుల సదరన్ సర్టిఫికెట్లను ఆర్థోస్పెషలిస్టు డాక్టర్ జయగోపాల్(శ్రీకాళహస్తి) పరిశీలించారు. స్థానిక కమ్యూనిటీ వైద్యశాలలో సోమవారం దివ్యాంగుల పింఛన్ల పరిశీలనా కేంద్రం ఏర్పాటు చేశారు. అందులో తొలిరోజు 50 మందిని డాక్టర్ పరిశీలించారు. మండల పరిధిలో 715 మంది దివ్యాంగులు పింఛన్లు పొందుతున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్.చంద్రశేఖర్, ఏపీఎంలు డాక్టర్ డాంగే యాదవ్, అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ వై రేవతి(తిరుపతి), డిజిటల్ అసిస్టెంట్ మొరార్జి సాయి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వసంత పంచమి



బుచ్చినాయుడుకండ్రిగలో సరస్వతీదేవికి పూజలు చేస్తున్న విద్యార్థినులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కల్లివెట్టు జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం చదువుల తల్లి సరస్వతీదేవి జన్మదినంగా భావించే వసంత పంచమిని పురస్కరించుకుని ప్రధానోపాధ్యాయులు రూపేష్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు సరస్వతీదేవి విగ్రహానికి పుష్పాలంకరణ చేశారు. విద్యార్థులు ఉపాధ్యాయుల నుంచి దీవెనలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు యువశ్రీ మురళి, సురేష్‌బాబు, నాదెండ్లమురళి, దాసు, లక్ష్మయ్య, దేవేంద్ర, జగన్నాథం, మురళీప్రసాద్, దీపిక పాల్గొన్నారు.

అక్కడ మద్యం తాగితే చర్యలు తప్పవు



హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేస్తున్న పోలీసులు

శ్రీకాళహస్తి: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు తప్పవని శ్రీకాళహస్తి 1వ పట్టణ సీఐ గోపి అన్నారు. పట్టణంలోని గంగా సదన్ వసతిగృహాల వద్ద సోమవారం ఖాళీ ప్రదేశాల్లో వ్యర్థాలు, మద్యం సీసాలను పురపాలక సంఘ సిబ్బంది చేత ఒకచోట పేర్చి దగ్ధం చేశారు. అనంతరం 'బహిరంగ ప్రదేశాల్లో మద్యపాన నిషేధం' అనే బోర్డులను ఏర్పాటు చేశారు.

పిల్లలకు లేవా చిక్కీలు?



మధ్యాహ్నభోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ రవి

సత్యవేడు: మండలంలోని కాళమనాయుడుపేట ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 29 మంది పిల్లలకు మధ్యాహ్న భోజనంతో పాటు అందించాల్సిన చిక్కీలు అందించడం లేదు. సోమవారం ఎంఈఓ కే.రవి పాఠశాలలో నిర్వహించే మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులకు వెజిటేబుల్ రైస్, గుడ్డుతో పాటు చిక్కీ ఇవ్వాల్సి ఉంది. అయితే గత 15 రోజులుగా పాఠశాలకు చిక్కీలు రావడం లేదు. ఎంఈఓ పరిశీలించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కే.కోటీశ్వరం పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం



చిన్నారుల చేత అక్షరాభ్యాసం చేయిస్తున్న జువ్వల ధనంజయరెడ్డి

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): వసంత పంచమి సందర్భంగా రేణిగుంట మండలం గాజుల మండ్యంలోని శ్రీ సాయి గణేష్ పాఠశాల ఆవరణలో చిన్నారుల చేత సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ముందుగా అర్చకులు దండపాణి సరస్వతీ పూజ నిర్వహించారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ జువ్వల ధనంజయరెడ్డి విద్యార్థులకు పలక, బలపాలు ఉచితంగా పంపిణీ చేసి అక్షరాభ్యాసం చేయించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం గ్రామంలోని చిన్నారులకు పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. వచ్చే సంవత్సరం గ్రామంలోని శివాలయంలో భారీ ఎత్తున సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చెంచు రెడ్డి, ఉపాధ్యాయులు,విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


మామిడి గజగజ



ప్రతి సంవత్సరం రైతులు మామిడి తోటలకు మందులు పిచికారీ చేసి రాత్రింబవళ్లు మామిడి చెట్లకు కాపలా కాసి చేతికి వచ్చిన పంటను కోసుకునే సమయంలో అడవి నుంచి ఏనుగుల మంద దాడి చేస్తోంది. మామిడి తోటలపైన పడి మామిడి కాయలను తినేసి చెట్లను ధ్వంసం చేసి బీభత్సం సృష్టిస్తోంది. గత పది సంవత్సరాల నుంచి ఇదే తంతు సాగుతున్నా అధికారులకు మాత్రం రైతుల గోడు పట్టడం లేదు.

గత ఏడాది మామిడి తోటలను ధ్వంసం చేసిన ఏనుగులు (ఫైల్)





- ప్రతి ఏటా మామిడి తోటలపై కొనసాగుతున్న ఏనుగుల దాడులు
- భయాందోళనలో రైతులు
- పట్టించుకోని అధికారులు

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): రేణిగుంట మండలం శేషాచల అడవుల మధ్యలో రేణిగుంట–కడప రహదారికి అనుకొని మామండూరు గ్రామం ఉంది. గ్రామస్తులకు వ్యవసాయమే జీవనాధారం. గ్రామానికి ఎదురుగా ఉన్న రైల్వే ట్రాక్‌కు అనుకుని సుమారు 90 ఎకరాలలో మామిడి తోటలు ఉన్నాయి. సుమారు 15 సంవత్సరాల ముందు అప్పటి అటవీ శాఖ అధికారులు మామిడి తోటలలోకి ఏనుగులు రాకుండా రెండున్నర కిలోమీటర్ల మేరకు 10అడుగుల లోతు, 10 అడుగుల వెడల్పుతో కందకాలు తవ్వించారు. కాలక్రమాన ఆ కందకాలు పూడిపోవడంతో పదేళ్లుగా మామిడి తోటలపై ఏనుగుల దాడులు కొనసాగుతున్నాయి. కష్టపడి పడించిన పంటను అమ్ముకుని సొమ్ము చేసుకుందాం అనే సమయంలో గజరాజుల మంద మామిడి చెట్లను ధ్వంసం చేయటం పరిపాటిగా మారింది.



గత ఏడాది ఏనుగుల దాడిలో విరిగిన మామిడి చెట్టు

ప్రతిసారీ నష్టమే

ప్రతి సారి పంట నష్టం జరిగిన తర్వాత అధికారులు రావటం, నష్టం అంచనాలను రాసుకొని వెళ్లటం, ఏనుగులు రాకుండా చర్యలు తీసుకుంటామని చెప్పడం, ఇదే తంతు కొనసాగుతోంది. అంతేకానీ ఆచరణలో ఒక్క అడుగు కూడా ముందుకు పడడం లేదు. ప్రతి సంవత్సరం పంట చేతికి వచ్చే సమయంలో ఏనుగులు దాడులు చేయడం, పంట నష్టం రావడం మామూలుగా మారింది. గత ఏడాది ఏనుగుల దాడులు జరిగిన సమయంలో మామిడి చెట్లను పూర్తిస్థాయిలో ధ్వంసం చేశాయి. కానీ రైతులు మాత్రం అప్పులు చేసి మామిడి పంటను పండించేందుకు సిద్ధపడుతున్నారు. ప్రస్తుతం మామిడి చెట్లు పూత దశలో ఉన్నాయి. రైతులు పూత రాలకుండా మామిడి తోటలకు మందులు పిచికారీ చేస్తున్నారు. ఈ ఏడాది అయినా పంట చేతికొచ్చే సరికి గజరాజులు రాకుండా అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకొని కందకాల్లో పూడిక తీయాలని స్థానిక మామిడి రైతులు కోరుతున్నారు.



పూడిపోయి ఉన్న కందకాలు





ట్రాక్టర్‌తో చెట్లకు మందులను పిచికారీ చేస్తున్న రైతులు

ఏనుగుల దాడులతో అల్లాడుతున్నాం



ప్రతి సంవత్సరం మామిడి తోటల్లో గజరాజులు దాడులు చేయడం వల్ల అల్లాడిపోతున్నాం. నాకు ఐదెకరాల మామిడి తోట ఉంది. గత ఏడాది ఏనుగుల దాడిలో సుమారు నాలుగు లక్షల వరకు నష్టం వాటిల్లింది. ఇప్పుడు మామిడి చెట్లకు పూత ఏపుగా వచ్చింది కానీ మళ్లీ ఏనుగుల దాడిని తలచుకుంటేనే నిద్ర పట్టటం లేదు.

– మునిరత్నం, మామిడి రైతు మామండూరు

అధికారులు పట్టించుకోలేదు



మామిడి తోటలలోకి ఏనుగులు రాకుండా చర్యలు తీసుకోమని అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా వారు పట్టించుకున్న పాపాన పోలేదు. ఇప్పుడు స్థానిక ఎమ్మెల్యే అయినా చొరవ తీసుకొని మా సమస్యను పరిష్కరించాలి. లేకుంటే మళ్లీ ఏనుగులు మామిడితోటల్లో దాడులు చేస్తే చేతికొచ్చిన పంట మొత్తం నష్టపోతాం. – చెంచమ్మ, మామండూరు

అప్పులు కట్టలేకపోతున్నాం



మామిడి తోటల సాగుకు చేసిన అప్పులు కట్టలేక ఇబ్బందులు పడుతున్నాము. తోటలను సాగుచేసి రాత్రి పగలు తేడా లేకుండా కాపలా కాసికాపాడిన పంటను ఏనుగులు ఒక్క రోజులోనే ధ్వంసం చేస్తున్నాయి. ప్రతి సంవత్సరం మా గ్రామంలో ఇలాగే జరుగుతా ఉంది. ఇప్పుడైనా అధికారులు మా సమస్యను పరిష్కరించాలి.

– దేవిక, మామండూరు

గాలి గోపురం బాధితులకు పరిహారం



సుశీలమ్మకు పరిహారం అందజేస్తున్న ఈవో బాపిరెడ్డి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి రాజగోపురం అనుకుని ఉన్న గృహాలకు సంబంధించి 2011లో గాలిగోపురం పడిపోయినపుడు ధ్వంసమైన ఇళ్లకు సంబంధించి నష్టపరిహారం, స్థల సేకరణకు కేటాయించిన సొమ్మును బాధితులకు ఈవో బాపిరెడ్డి సోమవారం అందజేశారు. 13 ఏళ్ల క్రితం తమకు పరిహారం చాలదని పెంచాలంటూ అపుడు ఇచ్చిన పరిహారాన్ని బాధితులు తీసుకోలేదు. దీనిపై కోర్టుకు వెళ్లారు. మాస్టర్‌ప్లాన్ బాధితులకు ఇచ్చిన పరిహారం తమకు ఇవ్వాలంటూ ఆలయ అధికారులను అనేక సార్లు కలిశారు. ఇందుకు సంబంధించి న్యాయం చేస్తామని వారికి హామీ ఇచ్చారు. మళ్లీ కోర్టుకు వెళ్లడంతో దానిని పరిష్కరించేందుకు వీలుకాలేదు. రోడ్డు విస్తరణలో భాగంగా స్థలాలు గలవారు అడ్డుకోవడంతో గత్యంతరం లేక వారికి పాత పరిహారమే ఇస్తామని తీసుకోకపోతే కోర్టులో సమర్పించి అడ్డుగా ఉన్న స్థలాలను తొలగిస్తామని నచ్చచెప్పారు. గత్యంతరం లేక బాధితులు ఇచ్చిన పరిహారం తీసుకున్నారు.

వెలుగు సొమ్ము స్వాహా చేసిన వారిపై ఫిర్యాదు



పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన చియ్యవరం గ్రామస్తులు

శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలం చియ్యవరం గ్రామానికి చెందిన వెలుగు సొమ్ము రూ.2.29కోట్లు స్వాహా చేసిన వారిపై ఫిర్యాదు చేసేందుకు డ్వాక్రా మహిళలు సోమవారం రాత్రి పోలీసులను సంప్రదించారు. బ్యాంకుకు కట్టాల్సిన సొమ్మును స్వాహాచేసిన వారికి నోటీసులు ఇవ్వకుండా తమకు ఇవ్వడంపై వెలుగు మహిళలు ఆందోళన చేస్తున్నారు. ఎమ్మెల్యేను కలవనీయకపోవడంతో చివరకు పోలీసులను ఆశ్రయించారు. మోసం చేసినవారిపై కేసులు నమోదు చేయాలని వారు పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు.

ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా జయరాములు



నాగలాపురం: పిచ్చాటూరు మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా జయరాములు నియమితులయ్యారు. గతంలో ఇక్కడ ఉన్న తహసీల్దార్ రమేష్ బాబు అనారోగ్యం బారిన పడినందున నారాయణవనం తహసీల్దార్‌గా పనిచేస్తున్న జయరాములుకు పిచ్చాటూరు మండల బాధ్యతలు కేటాయించినట్లు తెలియజేశారు.

దళితులకు ఇంటి స్థలాలు ఇవ్వాలి



వినతిపత్రాన్ని అందజేస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కనమనంబేడు గ్రామ దళితులకు ఇంటి స్థలాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో దళితులతో కలసి ఆయన ఇంటి స్థలాల కోసం ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ కనమనంబేడు గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబరు 252, 253, 254లో గల ప్రభుత్వ భూమిని దళితులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్థానికేతుడైన డాక్టరు బత్తెయ్యనాయుడు ఎకరా 75 సెంట్లు ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని, ఫెన్సింగ్ వేసినప్పటికీ రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదని తెలిపారు. గ్రామంలోని పలువురు దళితులు ఇంటి స్థలాలు లేక ఇబ్బంది పడుతున్నామన్నారు. బత్తెయ్యనాయుడు భూక్రమణను అడ్డుకున్న 10 మంది దళితులపై అక్రమ కేసులు పెట్టిన అధికారులు భూకబ్జాదారులకు కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. తక్షణమే దళితులపై పెట్టిన కేసును వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దళితులకు ఒక్కొక్కరికి 3 సెంట్లు స్థలాలను ఇవ్వాలన్నారు. అనంతరం సీపీఐ సత్యవేడు నియోజకవర్గ కార్యదర్శి చిన్నిరాజు మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు స్థానికేతరులకు అమ్ముడు పోయి ప్రభుత్వ భూమిని అప్పగిస్తున్నారని, పేదలను పట్టించుకోవడం లేదన్నారు. అనంతరం కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్ నాగరాజురెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు కత్తిరవి, మండల కార్యదర్శి కత్తిధర్మయ్య పాల్గొన్నారు.

మహా శివరాత్రి పోస్టర్ల ఆవిష్కరణ



మహాశివరాత్రి పోస్టర్లను ఆవిష్కరిస్తున్న గుండాల గోపినాథ్

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): రేణిగుంట మండలం వెదుళ్ల చెరువు గ్రామంలో వెలసిన శ్రీ ఓంకార జ్యోతి లింగేశ్వర స్వామి దేవాలయంలో మహా శివరాత్రి వేడుకలకు సంబంధించిన పోస్టర్లను ఆలయ ఆవరణలో సోమవారం రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 26న జరిగే మహా శివరాత్రి వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. అందులో భాగంగానే మహాశివరాత్రి పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. భక్తులందరూ మహాశివరాత్రి వేడుకల్లో పాల్గొని పరమేశ్వరుడి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కష్టయ్య స్వామి, ఆలయ సభ్యులు చంద్రశేఖర్ స్వామి, కొండెచెంగారెడ్డి, తొండమనాడు సుబ్రహ్మణ్యం రెడ్డి, పురోహితుడు సురేష్ స్వామి, ఫణి భూషణ్ రెడ్డి, జ్యోతి భాస్కర్, భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో రథసప్తమి ఏర్పాట్లు

నారాయణవనం: సూర్యజయంతిని పురస్కరించుకుని మంగళవారం పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఏడు వాహనాలపై ఒక్కరోజు బ్రహ్మోత్సవాన్ని నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ అధికారి నాగరాజు, ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్య తెలిపారు. మీడియాతో మాట్లాడుతూ వేకువ జామున 4.30 గంటలకు సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరిచి నిత్య కైంకర్యాల అనంతరం 6.40 గంటలకు సూర్యప్రభ వాహన సేవ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆలయానికి చేరుకున్న ఉత్సవమూర్తి చిన్నశేష, పల్లకి, కల్పవృక్ష, పెద్దశేష, తిరుచ్చి వాహనాలపై మాడవీధి ఉత్సవాల్లో దర్శనమిస్తారని అన్నారు. సాయంత్రం పూజల అనంతరం 6 గంటలకు చంద్రప్రభ వాహనంపై గ్రామవీధుల్లో ఊరేగింపు ఉంటుందని తెలిపారు. ఆలయానికి చేరుకున్న ఉత్సవర్లకు ఆస్థానం నిర్వహించి రాత్రి 9 గంటలకు ఏకాంత సేవతో ఆలయ ద్వారాలు మూసివేయనున్నట్లు వారు తెలిపారు. ఆలయంలో మామిడి తోరణాలు, అరటి చెట్లను కట్టి అలంకరించారు.

ఆక్రమణలపై విచారణ చేయాలి



ఆక్రమిత భూములు పరిశీలిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి పి. మురళి

సత్యవేడు: మండలంలోని కొత్తమారికుప్పం రెవెన్యూలో జరిగిన భూ ఆక్రమణలపై విచారణ చేపట్టాలని జిల్లా అధికారులను సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి కోరారు. సీపీఐ నాయకులు నియోజకవర్గ కార్యదర్శి చిన్నిరాజ్‌తో కలసి సోమవారం కొత్తమారికుప్పం గిరిజన కాలనీలో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ కొత్తమారికుప్పం సర్వేనెంబరు 300 నుంచి 386 వరకు ఉన్న సుమారు 350 ఎకరాల భూమిని అనర్హులు, స్థానికేతరులు ఆక్రమించారన్నారు. ఆక్రమణదారులు ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకొని పట్టాదారు పాసుపుస్తకాలు పొంది మామిడి, తగిలం తోటలు పెంచుతున్నారన్నారు. ఇదే విషయంపై 15 రోజుల క్రితం తిరుపతిలో జిల్లా కలెక్టరు కార్యాలయం వద్ద నిరసన తెలిపారని గుర్తు చేశారు. గిరిజనులు, దళితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు సుధాకర్ రెడ్డి, ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, పురుషోత్తంతోపాటు గిరిజనులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆవు మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గోవు

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): తిరుపతి నుంచి ముసిలిపేడు వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు రేణిగుంట మండలం కొత్తపాలెం సమీపంలో గోవును అతివేగంగా ఢీకొట్టడంతో గోవు అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికుల సమాచారం మేరకు, సోమవారం రాత్రి తిరుపతి వైపు నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు కొత్త పాళెం సమీపంలో రోడ్డుపై ఉన్న ఆవును ఢీ కొట్టింది. దీంతో ఆ చూడి ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. రూ.60 వేలు విలువచేసే ఆవు మృతి చెందడంతో యజమాని తెలిపారు. గాజుల మండ్యం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారిస్తున్నారు.

అండర్ 16 కబడ్డీ పోటీలకు నవీన్ కుమార్



కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపల్

నాగలాపురం: పిచ్చాటూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి వి.నవీన్ కుమార్ వైఎస్సార్ జిల్లా మైదుకూరులో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్ 16 కబడ్డీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచి ఎంపికయ్యాడు. ఈ మేరకు నవీన్ కుమార్‌ను పాఠశాల అధ్యాపకులు అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో జరగబోయే పోటీల్లో నవీన్ పాల్గొంటున్నట్లు తెలిపారు.

కండక్టర్ దురుసు ప్రవర్తన



బస్సులో నుంచి దిగిన వృద్ధుడు (ఇన్‌సెట్) టికెట్

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): టికెట్ ధర అడిగిన ప్రయాణికుడిని కండక్టర్ మధ్యలో బస్సు నుంచి దింపేసిన ఘటన రేణిగుంటలో చోటుచేసుకుంది. బాధితుడి కథనం మేరకు.. సోమవారం పాపానాయుడు పేట వైపు నుంచి తిరుపతికి వెళుతున్న ఆర్టీసీ బస్సులో మల్లిగుంట వద్ద వృద్ధుడు సుబ్రహ్మణ్యం బస్సు ఎక్కి రేణిగుంటకు టికెట్ కోసం రూ.100 కండక్టర్‌కు ఇచ్చాడు. కండక్టర్ రూ.20 టికెట్ ఇవ్వగా.. వృద్ధుడు టికెట్ రూ.10 కదా అని అడిగాడు. కోపోద్రిక్తుడైన కండక్టర్ వృద్ధ ప్రయాణికుడిపై దురుసుగా ప్రవర్తించి మార్గ మధ్యంలోనే పాత చెక్‌పోస్టు వద్ద దింపేశాడు.

శ్రీసిటీ రూ.10 లక్షల విరాళం



శ్రీసిటీ (వరదయ్యపాళెం): ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం శ్రీసిటీ ఫౌండేషన్ సీఎస్ఆర్ అటవీశాఖకు రూ.10లక్షల విరాళం ఇచ్చింది. తిరుపతి జిల్లాలో వలస పక్షులకు కీలక ఆవాసమైన నేలపట్టు పక్షుల అభయారణ్యంలో మౌలిక సదుపాయాల కల్పన, సందర్శకుల వసతుల పెంపునకు ఈ విరాళం తోడ్పడనున్నట్లు సూళ్లూరుపేట డీఎఫ్ఓ హారిక, శ్రీసిటీ ఫౌండేషన్ డైరెక్టర్ నిరీషా సన్నారెడ్డి తెలిపారు. ఈ మేరకు విరాళం చెక్కును తిరుపతి సర్కిల్ ఫారెస్ట్ కన్జర్వేటర్ సెల్వంకు అందజేశారు.

ఫిష్ పాండ్ల తవ్వకం లాభదాయకం



ఉపాధి పనులను పరిశీలిస్తున్న పీడీ శ్రీనివాసప్రసాద్

రేణిగుంట(ఏర్పేడు): ఉపాధిహామీ పథకం కింద ఫిష్ పాండ్ల తవ్వకం పనిని చేపట్టి గ్రామ పంచాయతీకి ఆదాయ వనరులను ఏర్పాటు చేసుకోవచ్చని డ్వామా పీడీ సి.వి శ్రీనివాస్ ప్రసాద్ అన్నారు. ఏర్పేడు మండలం అముదూరులో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన కూలీలతో మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా ఫిష్ పాండ్‌ను చెరువుల్లో తవ్వడం వల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయని చెప్పారు. చెరువులను చేపల పెంపకానికి లీజుకు ఇచ్చినప్పుడు, లీజుదారుడు చిన్న చేపలను ఫిష్ పాండ్‌లో వదలడం వలన మేత ఖర్చులు తగ్గుతాయన్నారు. చెరువులోని కొంత విస్తీర్ణంలో ఈ ఫిష్ పాండ్ ఉండడం వలన చిన్న చేపలకు రక్షణ ఉండి చేపలు తొందరగా ఎదుగుదతాయని చెప్పారు. తద్వారా అధిక చేపల దిగుబడి రావడానికి ఆస్కారం కలుగుతుందని అన్నారు. అనంతరం రాజులపాళెంలో నిర్మించిన సిమెంట్ రోడ్డును పరిశీలించారు. సిమెంట్ రోడ్డు పనులను వెంటనే మొదలుపెట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీవోలు డీసీ చంద్రశేఖర్ రాజు, అవిలాల దేవరి, జూనియర్ ఇంజినీర్ బాలాజీ రావు, టెక్నికల్ అసిస్టెంట్ మనోహర్, వేంకటాద్రి ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసు నమోదు

సత్యవేడు: మండల పరిధిలోని ఓబుల రాజు కండ్రిగ గ్రామానికి చెందిన జగదీష్, భాస్కరయ్యపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామస్వామి తెలిపారు. ఓబులరాజు కండ్రిగకు చెందిన జగదీష్, భాస్కరయ్య కలిసి లక్ష్మయ్య ఆటోను బాడుగకు కుదుర్చుకున్నారు. అయితే ఆటోలో ఉన్న ప్రయాణికులను చిన్న పాండూరులో దింపేసి వస్తానంటూ లక్ష్మయ్య వెళ్లి వచ్చాడు. అయితే అప్పటికే మరో ఆటోలో ఎరువుల సంచులు వేసుకొని జగదీష్, భాస్కరయ్య వెళుతుండగా వారిని లక్ష్మయ్య అడ్డుకున్నాడు. ఈ క్రమంలో ఆటో డ్రైవర్ లక్ష్మయ్యను కులంపేరుతో జగదీష్, భాస్కరయ్య దూషించారు. మళ్లీ గ్రామంలో ఇదే విషయమై ఘర్షణకు దిగడంతో ఆటో డ్రైవర్ లక్ష్మయ్య గాయాలపాలయ్యాడు. సత్యవేడు పోలీస్ స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశాడు. దీంతో జగదీష్, భాస్కర్‌పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసును నమోదు చేశారు.

మమ్మోగ్రామ్‌తో రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ



మిద్దికండ్రిగలో వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

కేవీబీపురం(వరదయ్యపాళెం): ప్రాథమిక దశలో రొమ్ము క్యాన్సర్‌ను గుర్తించేందుకు 35ఏళ్లు దాటిన మహిళలందరూ మమ్మోగ్రామ్ పరీక్ష చేయించుకోవాలని కేవీబీపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కటారి కుమార్ కోరారు. స్విమ్స్ ఆధ్వర్యంలో సోమవారం కేవీబీపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మిద్దికండ్రిగ, కోటమంగాపురం ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. పింక్ బస్ ద్వారా మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలతో పాటు బీపీ, షుగర్, ఇతర స్క్రీనింగ్ పరీక్షలు చేపట్టారు. కార్యక్రమంలో స్విమ్స్ వైద్యులు చైతన్యభాను, పద్మావతి, వాణి, స్థానిక సర్పంచ్‌లు రాధాకృష్ణ, తిరుపాల్, పంచాయతీ కార్యదర్శులు నరేష్‌బాబు, మునీంద్రమ్మ, ఎంపీహెచ్ఈఓ రవీంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల పరిశీలన

శ్రీకాళహస్తి: పట్టణంలోని రాజీవ్‌నగర్ సమీపంలో ఉన్న టిడ్కో ఇళ్లను సోమవారం రాష్ట్ర టిడ్కో హౌస్ కార్పొరేషన్ చైర్మన్ వేమలపాటి అజయ్‌కుమార్ పరిశీలించారు. త్వరలోనే వాటిని పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేస్తామన్నారు.